

## మావోయిస్టు అగ్రనేత గణపతి లొంగుబాటు?

- ఢిల్లీలో పోలీసుల అదుపులో ఉన్నట్లు ప్రచారం
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ప్రెస్‌మీట్ ?
- ఇవాళో రేపో స్పష్టత వచ్చే అవకాశం

05




## పటిష్ఠ కార్యాచరణ రూపొందించాలి

- మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 10 అంశాలపై ప్రత్యేక డ్రైవ్
- సమీక్షా సమావేశంలో అధికారులకు దిశానిర్దేశం

జిల్లాలో 99 రోజుల 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'పై కలెక్టర్ సత్యశారద

02

సంపుటి :03 | సంచిక :29 | పేజీలు :06 | www.aksharadarbar.com

# అక్షర దర్బార్

Voice of the People


వెల ₹5

బుధవారం 04, మార్చి 2026

## ఫ్లైఓవర్‌పై నెత్తురోడిన రహదారి

- ఇద్దరు యువకుల దుర్మరణం
- బొలెరో - బైక్ ఎదురెదురుగా ఢీ..
- మరొకరి పరిస్థితి విషమం
- మృతులు వరుసకు అన్నదమ్ములు..
- జ్యోతినగర్‌లో విషాదం

03



## నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదు

- కేజీబీవీ తనిఖీలో కలెక్టర్ స్నేహ శబరీష్ సీరియస్.
- విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవద్దని ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం


03



## జాతర జోష్

- కొమ్మాల లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ప్రభ బండ్ల ఉత్సవం

05







### సేవ చేయాలనే తపనతోనే..

"పరకాల మా సొంత ఇల్లు లాంటిది. వచ్చే ఎన్నికల్లో ఇక్కడి నుంచి కొండా కుటుంబం తరపున పోటీ ఖాయం. మా కూతురు సుస్మితకు రాజకీయాలపై పూర్తి అవగాహన ఉంది. కార్యకర్తలకు ఏ చిన్న సమస్య వచ్చినా ఆమె ముందుండి పోరాడుతుంది. ప్రజలకు సేవ చేయాలనే తపన తనలో బలంగా ఉంది. నియోజకవర్గ అభివృద్ధి కోసం, కార్యకర్తల ఆత్మగౌరవం కోసం మేము నిరంతరం శ్రమిస్తాం."

– మంత్రి కొండా సురేఖ

### పరకాల నుంచే నా రాజకీయ ప్రస్థానం

"నా తల్లిదండ్రుల రాజకీయ ప్రస్థానం కొమ్మాల జాతర నుంచే మొదలైంది. ఇప్పుడు నా రాజకీయ ప్రస్థానం కూడా ఇక్కడి నుంచే ప్రారంభమవుతుంది. వచ్చే ఎన్నికల్లో నేను తప్పకుండా పరకాల నుంచే పోటీ చేస్తాను. ఇక్కడి ప్రజల బాధలు నాకు తెలుసు. మీ సేవ కోసం వారంలో రెండు రోజులు అందుబాటులో ఉంటాను. కార్యకర్తల కోసం ఎంతటి వారినైనా ఎదిరించే దమ్ము నాకుంది. పరకాల గడ్డపై ఎమ్మెల్యేగా గెలిచి తీరుతాను."

– సుస్మిత పటేల్

### రాజకీయ వారసురాలు సుష్మితపటేల్

"పరకాల మా ఫ్యామిలీ అడ్డా. రాబోయే రోజుల్లో మా వారసురాలిగా కొండా సుస్మిత కార్యకర్తల బాగోగులు చూసుకుంటుంది. తను నా కంటే ధైర్యవంతురాలు. ఎవరిని ఎదిరించాలన్నా అస్సలు వెనకాడదు. కార్యకర్తల కోసం ప్రాణాలకైనా తెగిస్తుంది. గీసుగొండ మా కుటుంబానికి అన్నం పెట్టిన గడ్డ. ఇక్కడి లక్ష్మీనరసింహస్వామి దయ వల్లే నేను చావు నుంచి బయటపడ్డాను. మా బిడ్డను మీ చేతుల్లో పెడుతున్నా.. ఆదరించండి."

– కొండా మురళి

# పరకాల రాజకీయ జ్వాల

## కొండా సుస్మిత సంచలన వ్యాఖ్యలు

### రాజకీయ ప్రస్థానం మొదలైందని స్పష్టీకరణ

- కొమ్మాల జాతర వేదికగా తండ్రితో కలిసి ప్రకటన
- తమ సొంత నియోజకవర్గమే టార్గెట్ అంటూ వివరణ
- కలకలం రేపిన సుస్మిత వ్యాఖ్యలు
- ఇప్పటికే కొండా కుటుంబం, ఎమ్మెల్యే రేవూరి మధ్య ఆధిపత్య పోరు
- మున్ముందు ఈ పోరు ఏ దరికి చేరుతుందనే చర్చ
- ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో పొలిటికల్ హీట్

02

ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాల్లో పెను మార్పులు చోటుచేసుకుంటున్నాయి. పరకాల నియోజకవర్గం నుంచే తన రాజకీయ ప్రస్థానం మొదలవుతుందని కొండా దంపతుల తనయ సుస్మిత బుధవారం ప్రకటించడం ఇక్కడి రాజకీయాల్లో కలకలం రేపింది. కొమ్మాల లక్ష్మీనరసింహస్వామి జాతర వేదికగా తండ్రి కొండా మురళీతో కలిసి మంగళవారం రాత్రి ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు జిల్లా కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త చర్చకు దారితీశాయి. తన తల్లిదండ్రుల రాజకీయ ప్రస్థానం ప్రారంభమైన చోటే తాను కూడా అడుగుపెడతానని, వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుస్తానని సుస్మిత స్పష్టం చేయడంతో నియోజకవర్గ సమీకరణాలు ఒక్కసారిగా మారిపోయాయి. ఈ ప్రకటనతో అటు అధికార పార్టీలో ఇటు నియోజకవర్గ ప్రజల్లో సరికొత్త పొలిటికల్ హీట్ రాజుకుంది. – అక్షరదర్బార్, వరంగల్

# పరకాల రాజకీయ జ్వాల



- కొండా సుస్మిత సంచలన వ్యాఖ్యలు
- రాజకీయ ప్రస్థానం మొదలైందని స్పష్టీకరణ
- కొమ్మాల జాతర వేదికగా తండ్రితో కలిసి ప్రకటన
- తమ సొంత నియోజకవర్గమే టార్గెట్ అంటూ వివరణ
- కలకలం రేపిన సుస్మిత వ్యాఖ్యలు
- ఇప్పటికే కొండా కుటుంబం, ఎమ్మెల్యే రేవూరి మధ్య ఆధిపత్య పోరు
- మున్ముందు ఈ పోరు ఏ దరికి చేరుతుందనే చర్చ
- ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో పొలిటికల్ హీట్

**అక్షరదర్బార్, వరంగల్ :**

ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాల్లో పెను మార్పులు చోటుచేసుకుంటున్నాయి. పరకాల నియోజకవర్గం నుంచే తన రాజకీయ ప్రస్థానం మొదలవుతుందని కొండా దంపతుల తనయ సుస్మిత బుధవారం ప్రకటించడం ఇక్కడి రాజకీయాల్లో కలకలం రేపింది. కొమ్మాల లక్ష్మీనరసింహస్వామి జాతర వేదికగా తండ్రి కొండా మురళీతో కలిసి మంగళవారం రాత్రి ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు జిల్లా కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త చర్చకు దారితీశాయి. తన తల్లిదండ్రుల రాజకీయ ప్రస్థానం ప్రారంభమైన చోటే తాను కూడా అడుగుపెడతానని, వచ్చే ఎన్నికల్లో పరకాల నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుస్తానని సుస్మిత స్పష్టం చేయడంతో నియోజకవర్గ సమీకరణాలు ఒక్కసారిగా మారిపోయాయి. ఈ ప్రకటనతో అటు అధికార పార్టీలో ఇటు నియోజకవర్గ ప్రజల్లో సరికొత్త పొలిటికల్ హీట్ రాజుకుంది.

**- పట్టుదలగా కొండా కుటుంబం**

పరకాల నియోజకవర్గంలో కొండా దంపతులకు మొదటి నుంచీ పట్టు ఉంది. ముఖ్యంగా వారి సొంత ఊరు 'వంచనగిరి' ఈ నియోజకవర్గ పరిధిలోని గీసుగొండ మండలంలోనే ఉండటం వారికి కలిసొచ్చే అంశం. తమ సొంత గడ్డపై మళ్లీ పట్టు సాధించాలని, తమ వారసురాలిని ఇక్కడి నుంచి అసెంబ్లీకి పంపాలని కొండా దంపతులు గట్టి పట్టుదలతో ఉన్నారు. గతంలో బీఆర్ఎస్ లో ఉన్న సమయంలోనే సుస్మిత కోసం పరకాల టికెట్ ఆశించినా, అప్పట్లో సాధ్యపడలేదు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలో ఉండటం, కొండా సురేఖ మంత్రిగా కొనసాగుతుండటంతో తమ రాజకీయ వారసురాలిని బరిలోకి దింపేందుకు ఇదే సరైన సమయమని వారు భావిస్తున్నారు. గీసుగొండ తమ కుటుంబానికి అన్నం పెట్టిన ప్రాంతమని, కొమ్మాల స్వామి దయ వల్లే తాను మృత్యువు నుంచి బయటపడ్డానని మురళి భావోద్వేగంగా పలకడం ఇక్కడ గమనార్హం.

**- ఎమ్మెల్యే రేవూరికి చిక్కులు**

కొండా ఫ్యామిలీ చేస్తున్న ఈ ప్రయత్నాలు పరకాల ప్రస్తుత ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి వర్గానికి మింగుడు పడటం లేదు. నియోజకవర్గంలో ఆధిపత్యం కోసం మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మధ్య కొంతకాలంగా అంతర్గత పోరు సాగుతోంది. స్థానిక ప్రొటోకాల్ విషయంలో గానీ, అభివృద్ధి పనుల విషయంలో గానీ ఇరు వర్గాల మధ్య తీవ్రమైన విభేదాలు ఉన్నాయి. గతంలో మంత్రి ఓఎస్డీ సుమంత్ వ్యవహారంలో పోలీసులు ఆమె ఇంటికి వెళ్లినప్పుడు సుస్మిత స్వయంగా అడ్డుకోవడం, నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరును విమర్శించడం వంటి ఘటనలు పార్టీలో సెగ పుట్టించాయి. ఇప్పుడు నేరుగా సీటుపైనే కన్నేయడంతో ఈ ఆధిపత్య మరింత ముదిరే అవకాశం కనిపిస్తోంది. ఇది కేవలం ఒక సీటు కోసం పోరాటం కాకుండా, జిల్లా రాజకీయాల్లో ఎవరి హవా సాగుతుందనే పంతానికి దారితీసింది.

**- కొండా అభిమానుల్లో జోష్**

వారసురాలి ఎంట్రీపై కొండా మురళీ వ్యాఖ్యలు పార్టీ క్యాడర్‌లో జోష్ నింపుతున్నాయి. సుస్మిత తనకంటే ధైర్యవంతురాలని, కార్యకర్తల కోసం ఎవరినైనా ఎదిరిస్తుందని ఆయన పేర్కొనడం ద్వారా తన కూతురి దూకుడు స్వభావాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. పరకాల ప్రాంతం తమకు పునాది అని, ఇక్కడి నుంచే తమ బిడ్డ ప్రస్థానం మొదలవుతుందని ఆయన తేల్చి చెప్పారు. ఈ ప్రకటనతో పరకాలలో ప్రస్తుతం కాంగ్రెస్ రెండు వర్గాలుగా చీలిపోయే ప్రమాదం ఏర్పడింది. ఒకవైపు సిట్టింగ్ ఎమ్మెల్యే తన పట్టు నిలుపుకోవాలని చూస్తుంటే, మరోవైపు కొండా ఫ్యామిలీ తమ అడ్డాను తిరిగి కైవసం చేసుకునేందుకు పావులు కదుపుతోంది. రాబోయే రోజుల్లో ఈ ఆధిపత్య పోరు ఏ మలుపు తిరుగుతుందోనన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.

# పటిష్ట కార్యాచరణ రూపొందించాలి

- జిల్లాలో 99 రోజుల 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'పై కలెక్టర్ సత్యశారద
- మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 10 అంశాలపై ప్రత్యేక డ్రైవ్
- సమీక్షా సమావేశంలో అధికారులకు దిశానిర్దేశం




అక్షరదర్బార్, వరంగల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 99 రోజుల "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక"ను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేసేందుకు పటిష్ట కార్యాచరణ రూపొందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పది ముఖ్య అంశాలపై అమలు విధానాన్ని ఆమె వివరించారు. ఈ నెల 6వ తేదీ నుంచి జూన్ 12 వరకు ఐదు దశల్లో కార్యక్రమాలు జరుగుతాయని కలెక్టర్ తెలిపారు. మార్చి 6 – 15 పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్ ఫైళ్ల పరిష్కారంపై ప్రత్యేక డ్రైవ్. ఏప్రిల్ 6 – 11 ఆరోగ్యం – గర్భిణీలు, చిన్నారులకు ప్రత్యేక వైద్య పరీక్షలు, పోషకాహార అవగాహన. ఏప్రిల్ 13 – 18: రోడ్డు భద్రత (అరైవ్ అలైవ్) – ట్రాఫిక్ నిబంధనల కఠిన అమలు. ఏప్రిల్ 20 – మే 2 సంక్షేమ పథకాల సమీక్ష, ఇందిరమ్మ ఇళ్ల పురోగతి, డ్రగ్స్ వ్యతిరేక ప్రచారం. మే 4 – 30 రైతులకు సాగు సలహాలు, పాఠశాలల మౌలిక వసతులు, యువతకు క్రీడలు, మహిళా సాధికారతపై దృష్టి. జూన్ 1 – 12 పర్యావరణ పరిరక్షణ, వృక్షారోపణ కార్యక్రమాలు.

**- క్షేత్రస్థాయి పర్యవేక్షణే కీలకం**

పాఠశాలలు, వసతి గృహాల్లో భోజన నాణ్యత, పారిశుద్ధ్యాన్ని అధికారులు ప్రతిరోజూ తనిఖీ చేయాలని, ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో గ్రౌండ్ లెవెల్ పురోగతిపై వార్డు అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సత్య శారద చెప్పారు. ప్రతి రోజూ చేపట్టిన పనుల వివరాలను 'ప్రగతి నివేదికల' రూపంలో సమర్పించాలని, నోడల్ అధికారులు పురోగతిని సమీక్షించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు జి. సంధ్యారాణి, వైవి గణేష్, డీఎఫ్ఓ అనుజ్ అగర్వాల్, డిఆర్ఓ విజయ లక్ష్మి తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# వైభవంగా కళ్యాణోత్సవం

అక్షరదర్బార్, మరిపెడ: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఉల్లేపల్లె గ్రామంలోని మల్లికార్జునస్వామి ఆలయంలో స్వామివారి వార్షిక కళ్యాణోత్సవం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఆధ్యాత్మిక వాతావరణంలో ఆలయ నిర్వాహకులు రామడుగు అచ్యుతరావు సునీత దంపతులు వారి వంశీకులు ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల నడుమ దివ్య కళ్యాణ మహోత్సవం వైభవంగా సాగింది. గ్రామ ప్రజలు, పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కళ్యాణాన్ని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. మంగళవాయిద్యాలు, హారతుల వెలుగులు, భక్తిగీతాలతో ఆలయ ప్రాంగణం పండుగ శోభతో కళకళలాడింది. గ్రామ ఐక్యతకు, భక్తి భావనకు ప్రతీకగా నిలిచిన ఈ పవిత్ర ఉత్సవం అందరిలో ఆనందాన్ని నింపింది.




# ములుగు రైతులకు రెండో పంటకూ సాగునీరు

- అవసరమైన చోట్ల చెక్ డ్యాంల నిర్మాణం
- రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రి సీతక్క
- సచివాలయం నుంచి ప్రాజెక్టులపై సమీక్ష

అక్షరదర్బార్, హైదరాబాద్ : ములుగు జిల్లాలో రెండో పంటకు కూడా సాగునీరు అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై ప్రతి వారం నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ములుగును సస్యశ్యామలం చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో బుధవారం మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆమె ఇరిగేషన్ ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని ప్రతి వాగులో ఏడాది పొడవునా నీరు నిల్వ ఉండేలా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అవసరమైన చోట వెంటనే చెక్ డ్యామ్‌లు నిర్మించాలని ఆదేశించారు. సాగు నీటితో పాటు తాగునీటి అవసరాలు తీర్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. జిల్లా యంత్రాంగం, ఇరిగేషన్ శాఖ సమన్వయంతో పనిచేసి రైతులకు త్వరగా నీరు అందించాలని స్పష్టం చేశారు. భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు మంత్రులు ఆదేశాలు జారీ చేశారు. వచ్చే 15 రోజుల్లో అంచనాలు, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్‌కు సూచించారు. రైతులకు నష్టపరిహారం వెంటనే చెల్లించి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. దేవాదుల, రామప్ప పాకాల, సమ్మక్క సారాలమ్మ వంటి ప్రాజెక్టుల పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు.

# నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదు

- కేజీబీవీ తనిఖీలో కలెక్టర్ స్నేహ శబరీష్ సీరియస్
- విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవద్దని ప్రిన్సిపాల్ పై ఆగ్రహం

అక్షరదర్బార్, మహబూబాబాద్ : జిల్లాలోని విద్యా సంస్థలు, వసతి గృహాల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్ స్పష్టం చేశారు. బుధవారం కేసముద్రం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ విద్యాలయం (కేజీబీవీ)ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పాఠశాలలు, వసతి గృహాల్లో హెల్త్, ఎడ్యుకేషన్, న్యూట్రిషన్, సానిటేషన్ అంశాలపై పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, ప్రతిరోజూ నివేదికలు



సమర్పించాలని సూచించారు.

### - ప్రిన్సిపాల్ పై ఆగ్రహం

తనిఖీలో భాగంగా కలెక్టర్ కేజీబీవీలోని స్టోర్ రూమ్, డైనింగ్ హాల్, కిచెన్ షెడ్లను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల పట్ల అసహనం వ్యక్తం చేస్తూ, విధుల్లో నిర్లక్ష్యం వహించిన ప్రిన్సిపల్, స్పెషల్ ఆఫీసర్ సోమలక్ష్మి పై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని చెప్పారు.

### - విద్యార్థులతో ముఖాముఖి

తరగతి గదులకు వెళ్లిన కలెక్టర్ విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. డైట్ మెనూ ప్రకారం భోజనం అందుతుందా? అని ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రానున్న పరీక్షల దృష్ట్యా విద్యార్థులకు ఎలాంటి మానసిక ఒత్తిడి కలగకుండా చూడాలి. క్లిష్టమైన అంశాలను డిజిటల్ తరగతులు, ప్రాక్టికల్స్ ద్వారా సులభంగా అర్థమయ్యేలా బోధించాలి. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలి. ఉపాధ్యాయులు కచ్చితంగా సమయపాలన పాటిస్తూ సిలబస్‌ను పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజేశ్వర్, స్థానిక తహసీల్దార్ వివేక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

- శాయంపేట మండలంలో పర్యటించిన ఎమ్మెల్యే జీఎస్సార్

అక్షర దర్బార్, శాయంపేట: శాయంపేట మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టనున్న సీసీ రోడ్లు, వీవో మహిళా సమాఖ్య భవనాలు, ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడల నిర్మాణ పనులకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల సమగ్రాభివృద్ధి కోసం ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించిందన్నారు. రహదారుల అభివృద్ధితో రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని, మహిళా సంఘాల భవనాల నిర్మాణంతో వారి కార్యకలాపాలకు బలం చేకూరుతుందని తెలిపారు. పాఠశాల ప్రహరీ గోడల నిర్మాణంతో విద్యార్థులకు సురక్షిత వాతావరణం కల్పించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు, ఉపసర్పంచులు, పార్టీ నాయకులు, మహిళా సంఘ సభ్యులు, అధికారులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.



# ఏకో ఫ్రెండ్లీ హోలీ సంబరాలు..

- ఆదర్శంగా నిలిచిన ముస్త్యాలపల్లి విద్యార్థులు



అక్షరదర్బార్, పరకాల: నడికూడ మండలం ముస్త్యాలపల్లి గ్రామంలోని పాఠశాల విద్యార్థులు పర్యావరణ హితంగా హోలీ పండుగను జరుపుకుని అందరికీ ఆదర్శంగా నిలిచారు. రసాయన రంగులను పూర్తిగా వదిలి, సహజ పదార్థాలతో సహజ రంగులతో తయారు చేసి హోలీ ఆడారు. బీట్‌రూట్‌తో ఎరుపు, క్యారెట్‌తో నారింజ, మోదుగ పూలతో పసుపు, పాలకూరతో ఆకుపచ్చ రంగులను సిద్ధం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు రసాయన రంగులు చర్మం, కళ్లతో పాటు పర్యావరణానికి హానికరమని వివరించి, ప్రకృతి పరిరక్షణ అవసరాన్ని విద్యార్థులకు తెలియజేశారు. గతంలో ఈకో ఫ్రెండ్లీ గణపతి, బతుకమ్మ, రాఖీ పండుగలను నిర్వహించిన విద్యార్థులు, ఈసారి ఈకో ఫ్రెండ్లీ హోలీ ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవడం మన బాధ్యత అని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కందుకూరి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పావని, సత్యపాల్‌తో పాటు సర్పంచ్ మేకమల్ల వెంకటేష్ పాల్గొని విద్యార్థులను అభినందించారు.

# ఉపాధ్యాయుల వేతనాలపై వ్యాఖ్యలు అర్థరహితం

- దేశ భవిష్యత్తుకు పెట్టుబడే టీచర్ల జీతాలు
- వరంగల్ కంటెస్టెడ్ ఎంపీ బొచ్చు రాజు



అక్షరదర్బార్, పరకాల: విద్యా కమిషన్ నివేదికలో ఉపాధ్యాయులకు వేతనాలు ఎక్కువగా ఉన్నాయన్న వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని వరంగల్ కాంటెస్టెడ్ ఎంపీ బొచ్చు రాజు స్వేరో పేర్కొన్నారు. ఉపాధ్యాయులకు ఇచ్చే వేతనం దేశ భవిష్యత్తుకు పెట్టుబడి వంటిదని ఆయన స్పష్టం చేశారు.విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళిపై తమకు ఎంతో గౌరవం ఉన్నప్పటికీ, ఉపాధ్యాయుల విషయంపై తీసుకున్న నిర్ణయంలో ఆలోచన తప్పుదోవ పట్టిందని అభిప్రాయపడ్డారు. ప్రతి మూడు, నాలుగు సంవత్సరాలకు ఒకసారి ఉపాధ్యాయులకు పరీక్షలు నిర్వహించాలని సూచిస్తే, అదే విధంగా అన్ని ప్రభుత్వ ఉద్యోగులకు కూడా పరీక్షలు నిర్వహించగలరా అని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు పెరగాలంటే ఉపాధ్యాయులను లక్ష్యంగా చేసుకోవడం సరైన మార్గం కాదన్నారు. పిల్లలు ప్రభుత్వ పాఠశాలలకు రావాలంటే ప్రత్యేక విధానాలు అవసరమని సూచించారు. తమిళనాడులో అమలు చేస్తున్న విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారికే ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలనే నిబంధన తీసుకురావాలని ప్రతిపాదించారు. అలాగే కనీసం వార్డు సభ్యులుగా పోటీ చేయాలంటే ఆ నాయకుల పిల్లలు కనీసం ఐదో లేదా ఏడో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉండాలనే చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులపై విమర్శలు చేయడం తగదని ఆయన పేర్కొన్నారు.

# ‘సెమీ రెసిడెన్షియల్ స్కూల్ గా ఏర్పాటు చేయాలి’

అక్షర దర్బార్, శాయంపేట: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన యంగ్ ఇండియా తెలంగాణ సెమీ రెసిడెన్షియల్ స్కూల్స్ నేపథ్యంలో పత్తిపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌ను సెమీ రెసిడెన్షియల్ తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుకు వినతిపత్రం అందజేశారు.పత్తిపాక జడ్పీ హైస్కూల్‌కు సుమారు పది గ్రామాలు ఫీడింగ్ విలేజెస్‌గా ఉండటంతో పాటు, విశాలమైన తరగతి గదులు, లైబ్రరీ మరియు అవసరమైన మౌలిక వసతులు ఇప్పటికే ఉన్నాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మండలాల వారీగా యంగ్ ఇండియా డిజిటల్ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో పత్తిపాక పాఠశాలను కూడా సెమీ రెసిడెన్షియల్ స్కూల్‌గా ఎంపిక చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, బహుజన సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మొగ్గం సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# ఫ్లైఓవర్‌పై నెత్తురోడిన రహదారి

- ఇద్దరు యువకుల దుర్మరణం
- బొలెరో - బైక్ ఎదురెదురుగా ఢీ.. మరొకరి పరిస్థితి విషమం
- మృతులు వరుసకు అన్నదమ్ములు.. జ్యోతినగర్ లో విషాదం

అక్షరదర్బార్, జనగామ: జనగామ జిల్లా కేంద్రంలోని ఫ్లైఓవర్‌పై బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అతివేగం, అజాగ్రత్త ముగ్గురు యువకుల జీవితాల్లో చీకటి నింపింది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో వ్యక్తి మృత్యువుతో పోరాడుతున్నాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. ఒకే బైక్‌పై ప్రయాణిస్తున్న యువకులను ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం బలంగా ఢీకొట్టింది. ఫ్లైఓవర్‌పై వాహనాలు వేగంగా ఉండటంతో ఈ ప్రమాదం తీవ్రత ఎక్కువగా ఉంది. బైక్ ను ఢీకొట్టిన అనంతరం బొలెరో వాహనం కూడా తీవ్రంగా దెబ్బతింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న మరాటి దినేశ్ (23), బాల్దె ధనుశ్ (20) తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ వారిద్దరూ మృతి చెందారు. మృతులిద్దరూ వరుసకు అన్నదమ్ములు కావడం గమనార్హం. వీరి మరణవార్త తెలియగానే జ్యోతినగర్‌లోని వారి కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలతో ఆ ప్రాంతమంతా విషాదంలో మునిగిపోయింది.

### - మరొకరి పరిస్థితి విషమం

ప్రమాద సమయంలో బొలెరో నడుపుతున్న డ్రైవర్ శివకృష్ణ గౌడ్ కూడా తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి అత్యంత విషమంగా ఉందని, వైద్యులు ఆయన ప్రాణాలు కాపాడేందుకు శ్రమిస్తున్నారని సమాచారం. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఫ్లైఓవర్‌పై ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి, ప్రమాదానికి గురైన వాహనాలను తొలగించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు




చేసి దర్యాప్తు ప్రారంభించారు.



# ప్లాటినం జూబ్లీ వేడుకలకు హాజరవ్వండి

- ఎస్బీటీఈటీ బోర్డు సెక్రెటరీని ఆహ్వానించిన ఈవీ శ్రీనివాస్ రావు

అక్షరదర్బార్, హనుమకొండ: రాష్ట్ర సాంకేతిక విద్యా శిక్షణ మండలి (ఎస్బీటీఈటీ) సెక్రెటరీ ఎ పుల్లయ్యను వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఈ నెల 29న వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న 70 సంవత్సరాల ప్లాటినం జూబ్లీ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరుకావాలని కోరుతూ శాలువాతో సత్కరించి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా సెక్రటరీ మాట్లాడుతూ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు రాష్ట్ర సాంకేతిక విద్యా అభివృద్ధికి ముఖ్య భూమిక వహిస్తున్నాయని, పూర్వ విద్యార్థుల సమ్మేళనం వంటి కార్యక్రమాలు విద్యార్థులకు స్ఫూర్తినిచ్చే వేదికలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. ప్లాటినం జూబ్లీ వేడుకలు నిర్వహిస్తున్నందుకు వరంగల్ పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థుల సంఘానికి అభినందనలు తెలిపారు. ఎస్బీటిఈటి సెక్రెటరీని కలిసిన వారిలో సంఘం ప్రధాన కార్యదర్శి మేకల అక్షయ్ కుమార్, నాయకులు ముషం శ్రీనివాస్, తాజుద్దీన్, శ్రీనివాస్ మహేంద్ర, చింతం గిరివర్మ, భూక్యా మధు, పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థిని ఇవీ కిరణ్మయి తదితరులు ఉన్నారు.

# టీయూఎఫ్ అధ్యక్షుడిగా రావుల రంజిత్



అక్షరదర్బార్, పరకాల: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (టి యు ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు ఓరుగంటి ఆనంద్ ఆదేశాల మేరకు, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు భాషబోయిన రవీందర్ యాదవ్ సూచనలతో హనుమకొండ జిల్లా పరకాల నియోజకవర్గ అధ్యక్షుడిగా రావుల రంజిత్‌ను నియమించారు. ఈ మేరకు హనుమకొండ జిల్లా అధ్యక్షులు చిలువేరు రమేష్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా రావుల రంజిత్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన టీయూఎఫ్ కుటుంబ సభ్యులకు ఉద్యమాభివందనాలు తెలిపారు.



# హోలీ శుభాకాంక్షలు తెలిపిన సోదా

అక్షరదర్బార్, పరకాల: రంగుల హోలీ పండుగను పురస్కరించుకుని పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు, మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా అనిత రామకృష్ణ హనుమకొండలోని తమ నివాస కాలనీలో వాసులతో కలిసి హోలీ వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పరకాల పట్టణ ప్రజలందరికీ హృదయపూర్వక హోలీ శుభాకాంక్షలు తెలిపారు.





# రాజకీయ జాతరగా కొమ్మాల

- జనసంద్రంగా గిర్నిబావి సెంటర్
- పోటాపోటీగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, ఎంసీపీఐ (యూ), సీపీఎం ప్రభబండ్లు
- హాజరైన ఎమ్మెల్యే దొంతి, మాజీ ఎమ్మెల్యే పెద్ది, బీజేపీ నేత గోగుల
- డీజే పాటలు, కోలాటాలు, నృత్యాలతో మార్మోగిన జాతర ప్రాంగణం
- పోలీసుల భారీ బందోబస్తు



అక్షర దర్బార్, దుగ్గొండి: గీసుకొండ మండలంలోని కొమ్మాల లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం జాతర ఈసారి పోటాపోటీ రాజకీయ ప్రభలతో రాజకీయ జాతరగా మారింది. బుధవారం తెల్లవారుజామున నుంచే వివిధ పార్టీల ప్రభలు కార్యకర్తలతో కలిసి గిర్నిబావి సెంటర్‌కు చేరుకున్నాయి. గత జాతరలో జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కాంగ్రెస్ ప్రభలకు, అనంతరం బీఆర్ఎస్, బీజేపీ తదితర పార్టీల ప్రభలకు అనుమతి ఇచ్చారు. డీజే పాటలు, కోలాటాలు, నృత్యాలు, బాణాసంచాతో ర్యాలీలుగా జాతరకు తరలి వచ్చిన ప్రభలు ప్రాంగణాన్ని కిక్కిరిసేలా చేశాయి. నర్సంపేట డివిజన్‌లోని దుగ్గొండి, నర్సంపేట రూరల్, చెన్నారావుపేట, నెక్కొండ మండలాల నుంచి భారీగా ప్రభలు రాగా, ముఖ్యంగా దుగ్గొండి మండలం నుంచి కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభలు అధికంగా పాల్గొన్నాయి.

## జాతరకు అధిక ప్రాధాన్యత : ఎమ్మెల్యే దొంతి

నర్సంపేట ప్రాంత ప్రజలు అత్యధికంగా ప్రాధాన్యత ఇచ్చే కొమ్మాల లక్ష్మీనరసింహస్వామి జాతరకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యధిక నిధులు సమకూర్చి అభివృద్ధి చేసిందని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో భక్తులకు ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదని అన్నారు. గతానికి భిన్నంగా ఎలాంటి అల్లర్లకు తావు లేకుండా జాతరను ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు .

## బీఆర్ఎస్ ప్రభలను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే పెద్ది

డివిజన్ వ్యాప్తంగా వివిధ మండలాల నుండి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ ప్రజలను నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కొబ్బరికాయ కొట్టి, ట్రాక్టర్ నడిపి ప్రారంభించారు. జాతర ప్రశాంతంగా జరిగేందుకు పార్టీ కార్యకర్తలు నాయకులు సమయనం పాటిస్తూ ముందుకెళ్లాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారదాహంతో జాతరలో సైతం ఆధిపత్యాన్ని కొనసాగించాలని చూస్తుందన్నారు. పార్టీ శ్రేణులు ఓపికతో ఉండాలని సూచించారు.

## బీజేపీ ప్రభలను ప్రారంభించిన రాణా ప్రతాప్ రెడ్డి

కొమ్మాల లక్ష్మీ నరసింహ స్వామి జాతరకు నర్సంపేట డివిజన్ లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బీజేపీ ప్రభలను ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి ప్రారంభించారు. వచ్చే జాతరకు కేంద్ర ప్రభుత్వం నుండి ప్రత్యేక నిధులు తీసుకురావడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

## పోలీసుల ముందస్తు వ్యూహం

### ప్రశాంతంగా ముగిసిన రాజకీయ ప్రభల ర్యాలీ

గత సంవత్సరం కొమ్మాల జాతరలో జరిగిన అల్లర్ల నేపథ్యంలో ఈసారి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. నర్సంపేట ఏసీపీ పున్నం రవీందర్ రెడ్డి నేతృత్వంలో డివిజన్ వ్యాప్తంగా భద్రతా చర్యలు చేపట్టారు. రాజకీయ ప్రభలు గిర్నిబావికి చేరుకునే క్రమంలో నర్సంపేట–వరంగల్ ప్రధాన రహదారిపై ట్రాఫిక్ రద్దీ నివారించేందుకు వాహనాలకు రోడ్డు డైవర్షన్ అమలు చేసి ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. సీఐలు, ఎస్ఐలు, ట్రాఫిక్ సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహిస్తూ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పర్యవేక్షించారు. బందోబస్తులో నర్సంపేట, దుగ్గొండి, ఆత్మకూర్ ప్రాంతాల సీఐలు శ్రీనివాస్, సాయి రమణ, సంతోష్, ఎస్ ఐలు రణధీర్ రెడ్డి, రఘుపతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.







# మావోయిస్టు అగ్రనేత
# గణపతి లొంగుబాటు?

- ఢిల్లీలో పోలీసుల అదుపులో ఉన్నట్లు ప్రచారం
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో ప్రెస్ మెట్ ?
- ఇవాళో రేపో స్పష్టత వచ్చే అవకాశం



అక్షరదర్బార్, న్యూఢిల్లీ :
దశాబ్దాల పాటు మావోయిస్టు ఉద్యమానికి దిశానిర్దేశం చేసిన ఆ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి ముప్పాళ లక్ష్మణరావు అలియాస్ గణపతి ఢిల్లీలో లొంగిపోయినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన పోలీసుల అదుపులో ఉన్నారని ఢిల్లీ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ఆయనను మీడియా ముందు ప్రవేశపెట్టే అవకాశం ఉందని ప్రచారం. దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా అంతం చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకున్న తరుణంలో ఈ లొంగుబాటు ప్రాధాన్యత సంతరించుకుంది. తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్ ఐజీ బి సుమతి ప్రస్తుతం ఢిల్లీలోనే ఉండటం ఈ వార్తలకు మరింత బలాన్ని చేకూరుస్తోంది. గత వారమే మావోయిస్టు పార్టీకి చెందిన కీలక నేతలు తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ, మల్లా రాజిరెడ్డి, దామోదర్, నర్సింహారెడ్డి వంటి వారు లొంగిపోయారు. గణపతిని కూడా జనజీవన స్రవంతిలోకి తీసుకువచ్చేందుకు తెలంగాణ పోలీసులు చేసిన చర్చలు సఫలమైనట్లు భావిస్తున్నారు. దాదాపు నాలుగు దశాబ్దాలుగా మావోయిస్టు ఉద్యమాన్ని నడిపించిన గణపతిపై అనేక రాష్ట్రాల్లో కేసులు నమోదయ్యాయి. గత కొంత కాలంగా గణపతి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నట్లు సమాచారం అందుతోంది. ఆయనకు మెరుగైన వైద్యం అందజేయాలన్న కుటుంబ సభ్యుల విన్నపం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం ప్రకటించిన పునరావాస ప్యాకేజీల పట్ల కూడా ఆయన సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. దీనిపై ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఒకవేళ గణపతి లొంగుబాటు నిజమైతే భారత మావోయిస్టు ఉద్యమ చరిత్రలో ఒక సుదీర్ఘ అధ్యాయం ముగిసినట్లేనని విశ్లేషకులు భావిస్తున్నారు.

# రేషన్ కార్డుదారులకు ఊరట

- మూడు నెలల బియ్యం ఒకేసారి పంపిణీ
- వేసవి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ నిర్ణయం

అక్షరదర్బార్, హైదరాబాద్ : రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని రేషన్ కార్డు లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు మూడు నెలల కోటాను ఏప్రిల్ నెలలోనే లబ్ధిదారులకు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర పౌర సరఫరాల శాఖ లేఖలు రాసింది. మార్చి మొదటి వారంలోనే ఎండలు తీవ్రంగా ఉండటంతో ప్రజలు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో ప్రస్తుతం రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారు. ప్రతి లబ్ధిదారునికి నెలకు ఆరు కిలోల చొప్పున ప్రభుత్వం బియ్యం అందజేస్తోంది. రాష్ట్రంలో కొత్తగా ఫుడ్ సెక్యూరిటీ కార్డుల సంఖ్య పెరగడంతో కోటికి పైగా కార్డుదారులు ఉన్నారు. కేంద్రం సూచనల మేరకు మూడు నెలల కోటాకు సరిపడా బియ్యం నిల్వలు, పంపిణీ సాధ్యాసాధ్యాలపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఒకేసారి మూడు నెలల కోటా పంపిణీ చేయడం వల్ల రవాణా ఖర్చులు తగ్గడంతో పాటు డీలర్లు, హమాలీలకు సమయం ఆదా అవుతుంది. అయితే గతంలో ఇలా పంపిణీ చేసిన సమయంలో రేషన్ డీలర్లు నిల్వ సామర్థ్యం లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. లబ్ధిదారులు మూడు నెలల కోటా కోసం మూడుసార్లు వేలిముద్ర వేయాల్సి ఉంటుంది. సర్వర్ సమస్యల కారణంగా ఒక్కో కార్డుకు ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ సాంకేతిక ఇబ్బందులను పరిష్కరించి పంపిణీ సజావుగా సాగేలా చూడాలని యోచిస్తున్నారు.

**ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం**

# మిస్సైల్ దాడి.. తెలంగాణవాసికి తీవ్రగాయాలు

- బతుకుదెరువు కోసం గల్ఫ్ వెళ్లగా ఘటన

అక్షర దర్బార్, ఎల్లారెడ్డిపేట: ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధ సెగలు గల్ఫ్ దేశాల్లోని భారతీయులను వణికిస్తున్నాయి. తాజాగా ఇరాన్ జరిపిన మిస్సైల్ దాడిలో తెలంగాణకు చెందిన ఓ వలస కార్మికుడు తీవ్రంగా గాయపడటం కలకలం రేపింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నందెల్లి రాజేశ్వర్‌రావు నాలుగేళ్లుగా ఉపాధి కోసం అబుదాబిలో ఉంటున్నాడు. అక్కడ విమానాశ్రయంలో క్లీనింగ్ సెక్షన్‌లో పనిచేస్తున్నాడు. ఆదివారం ఇరాన్ జరిపిన మిస్సైల్ దాడి ప్రభావంతో ఎయిర్‌పోర్ట్ అద్దాలు ఒక్కసారిగా పగిలిపోయాయి. ఈ ప్రమాదంలో గాజు పెంకులు రాజేశ్వర్‌రావు ఛాతి, కుడి చేతిలోకి బలంగా దూసుకుపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే సహచర కార్మికులు అతడిని ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం రాజేశ్వర్‌రావు తన గదికి చేరుకున్నట్లు సమాచారం.

# జాతర జోష్

- కొమ్మాల లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ప్రభ బండ్ల ఉత్సవం



అక్షరదర్బార్, గీసుకొండ : ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధిగాంచిన కొమ్మాల లక్ష్మీనరసింహస్వామి జాతర అత్యంత వైభవోపేతంగా ప్రారంభమైంది. జాతరలో ప్రధాన ఘట్టమైన ప్రభ బండ్ల కార్యక్రమం మంగళవారం రాత్రి అట్టహాసంగా సాగింది. వరంగల్ జిల్లా గీసుకొండ మండలం కొమ్మాల గ్రామంలో నిర్వహించిన ఈ ఉత్సవం భక్తుల కోలాహలంతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఏళ్ల తరబడి వస్తున్న సంప్రదాయం ప్రకారం నర్సంపేట, వరంగల్ తూర్పు, పరకాల నియోజకవర్గాల పరిధిలోని భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. రాజకీయ పార్టీల నేతలు పోటాపోటీగా ఎడ్లబండ్లను ప్రభలతో అలంకరించి నరసింహస్వామికి సమర్పించారు. దాదాపు 40 నుండి 50 అడుగుల ఎత్తులో అత్యంత సుందరంగా తీర్చిదిద్దిన ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండ మురళి, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సహా పలువురు ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు. ప్రభ బండ్ల ఊరేగింపులో టపాసులు పేలుస్తుండగా ప్రమాదవశాత్తు ఒక ప్రభ బండికి మంటలు అంటుకున్నాయి. వెంటనే స్పందించిన భక్తులు నీళ్లు చల్లి మంటలను ఆర్పడంతో పెను ప్రమాదం తప్పింది. మరోవైపు, మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం గుంజేడులో ముసలమ్మ జాతర బుధవారం ఘనంగా ప్రారంభమైంది. జాతరకు సంకేతంగా పూజారులు అడవి నుండి వనం రూపంలో అమ్మవారిని తీసుకువచ్చి ఆలయంలో ప్రతిష్ఠించారు. ఈ వనజాతర మూడు రోజుల పాటు కొనసాగనుంది. గిరిజన, ఆదివాసీ ప్రజలతో పాటు గిరిజనేతరులు కూడా పెద్ద ఎత్తున ఈ ఉత్సవానికి హాజరవుతున్నారు. భక్తుల సౌకర్యార్థం దేవాదాయ శాఖ అన్ని ఏర్పాట్లు చేస్తోంది.



# ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

- శుభాకాంక్షలు తెలిపిన ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు, అధికారులు

అక్షరదర్బార్, హనుమకొండ: వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పుట్టినరోజును పురస్కరించుకొని హన్మకొండ సుబేదారిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు పెద్ద సంఖ్యలో హాజరై తమ అభిమాన నాయకుడు నాగరాజుకు పుష్పగుచ్ఛాలు, పుస్తకాలు, ప్యాడ్స్ అందించి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, ప్రజాసేవే ధ్యేయంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు ఆయురారోగ్యాలతో మరెన్నో సంవత్సరాలు ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. వీరి మధ్య ఎమ్మెల్యే నాగరాజు కేక్ కట్ చేశారు. ఆయన జన్మదిన వేడుకల సందర్భంగా క్యాంపు కార్యాలయం సందడిగా మారింది. తన జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు భద్రకాళి ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు.



# రాజకీయ ఒత్తిడి తేవడం దురదృష్టకరం

అక్షర దర్బార్ శాయంపేట : శాయంపేట మండలం తహరాపూర్ అంగన్వాడీ కేంద్రంలో బాలమృతం పంపిణీ వ్యవహారం ఉద్రిక్తతకు దారి తీసింది. నిబంధనల ప్రకారం గర్భిణీ స్త్రీల ఫోటో నమోదు పూర్తయిన తర్వాతే బాలమృతం అందించాల్సి ఉంటుందని అంగన్వాడీ టీచర్ స్వరూపరాణి స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయడమే తన బాధ్యతనని చెప్పినందుకే తనపై అనవసర ఆరోపణలు, ఒత్తిడులు తెచ్చారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడినని చెప్పుకుంటూ కొమ్ముల శివ తీవ్రంగా స్పందించారని ఆమె ఆరోపించారు. “నేనెంటో నీకు తెలియదా... నీ సంగతి చూస్తా...” అంటూ రాజకీయ హోదా చూపిస్తూ బెదిరింపులకు దిగినట్లు పేర్కొన్నారు. గర్భిణీ స్త్రీల ఫోటో నమోదు పూర్తయిన తర్వాతే నిబంధనల ప్రకారం అందజేస్తానని చెప్పిన మాటను వక్రీకరించి వివాదంగా మలిచారని తెలిపారు.ప్రతి నెల అదనంగా బాలమృతం ప్యాకెట్లు ఇచ్చిన విషయాన్ని పక్కన బెట్టి, ఒకసారి సరఫరా లోపం తలెత్తగానే రాజకీయ ఒత్తిడి తేవడం దురదృష్టకరమని స్వరూపరాణి విమర్శించారు. ప్రజాసేవలో నిబద్ధతతో పనిచేస్తున్న అంగన్వాడీ సిబ్బందిని బెదిరించడం సరైంది కాదని, అధికారుల సమక్షంలో పూర్తి వివరాలు వెల్లడిస్తానని స్పష్టం చేశారు.ఇదిలా ఉండగా, కోడిగుడ్లపై తేదీల ముద్రణలో తలెత్తిన వివాదంపై ఇంచార్జ్ సిడిపిఓ ఉమా కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. సరఫరా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే సాంకేతిక లోపం చోటుచేసుకుందని పేర్కొంటూ, ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.

వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

## ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!

## మీ నమ్మకమే మా బలం!

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : aksharadarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915